సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



ఇసుక ఫిల్టర్లు ధ్వంసం

చుక్కాపూర్ సమీపంలో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ఫిల్టర్లపై గురువారం అధికారులు దాడులు చేశారు. 10లో ▸



డ్రోన్ పిచికారీతో..

డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అకిన్ అనలెటిక్స్ సంస్థ డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. 10లో ▸



ప్రైవేట్ బస్సు బీభత్సం

హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం ఉదయం ఓ ప్రైవేటు బస్సు బీభత్సం సృష్టించింది. 10లో ▸

న్యూస్‌రీల్

సీపీఆర్‌పై అవగాహన అవసరం

జిల్లా వైద్యాధికారి లలితాదేవి

మొయినాబాద్: అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే కాపాడే సీపీఆర్ చేసే విధానంపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా వైద్యాధికారి లలితాదేవి అన్నారు. మున్సిపల్ పరిధిలోని భాస్కర్ మెడికల్ కళాశాలలో గురువారం సీపీఆర్ ఏఎల్ఎస్, బీఎల్ఎస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ఛాతిపై చేతులు పెట్టి వత్తడంతో వారి ఊపిరి ఆగిపోకుండా ప్రాణాలు నిలబెట్టవచ్చన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్ ఆఫీసర్ సీహెచ్ రాజేశ్, చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేందర్‌బాబు, భాస్కర కళాశాల ప్రొఫెసర్ ప్రదీప్, మండల వైద్యాధికారి అన్నపూర్ణ, సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ పశువుకు టీకా తప్పనిసరి

పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాశ్



మొయినాబాద్: సురంగల్‌లో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సుభాశ్

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్: ప్రతీ పశువుకు గాలికుంటు నివారణ టీకా తప్పక వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుభాశ్ సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని సురంగల్, అమ్డాపూర్‌లో టీకా కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో టీకాలు వేస్తున్నారా.. లేదా అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పశువును గుర్తించి టీకా వేయాలన్నారు. నేరుగా వ్యవసాయ పొలాలు, పశువుల పాకల వద్దకే వెళ్లి.. టీకా వేయించకపోతే కలిగే నష్టాలను రైతులకు వివరించి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సురంగల్‌లో 196 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు అహ్మద్, దేవీరెడ్డి, సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా, గోపాలమిత్ర శ్రీనివాస్, ఓఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి గూడూరు దరఖాస్తు



చల్లాకు దరఖాస్తు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: డీసీసీ అధ్యక్ష పదవి కోసం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు గురువారం ఆయన టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి దరఖాస్తు సమర్పించారు. 25 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్నాని.. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీల్లో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పదవులు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేశానని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచి ఒకే జెండా కింద పని చేస్తున్న తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నామినేషన్లు బేరీజు వేస్తున్న అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి 407 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 569 బ్యాలెట్ యూనిట్లు,కంట్రోల్ యూనిట్లు, 610 వీవీప్యాట్స్‌ను అధికారులు కేటాయించారు. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య పరిమితంగానే ఉంటుందని, గత అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సాంకేతిక సమస్యలు తలెత్తితే వినియోగించేందుకని కొంత శాతం రిజర్వుతో వీటిని కేటాయించారు. నామినేషన్లు వేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వివిధ బాధిత వర్గాలకు చెందిన వారు ఇండిపెండెంట్లుగా నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమైన నేపథ్యంలో అధికారులు పరిస్థితులను బేరీజు వేస్తున్నారు. భారీ సంఖ్యలో అభ్యర్థులు బరిలో ఉంటే ఏంచేయాలా అనే యోచనలో పడ్డారు. కేటాయించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ల మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తయినట్లు పేర్కొన్నారు. వీటిని స్ట్రాంగ్‌రూముల్లో భద్రరిచారు.

మితిమీరితే ఊచలే!

- సోషల్‌మీడియా ఇంటర్వ్యూలపై సిటీ పోలీసుల కన్ను
- మైనర్లతో అభ్యంతరకర వీడియోలు చేస్తున్న కొందరు
- తీవ్రంగా పరిగణించిన నగర పోలీసు కమిషనర్ సజ్జనర్
- పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల కాలంలో యూట్యూబ్ చానళ్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. దీంతో పాటు ఇతర సోషల్ మీడియాలోనూ పోటీ పెరిగిపోయింది. ఎవరికి వారు లైకులు, షేర్లు, వ్యూస్ కోసం వివిధ మార్గాలు ఎంచుకుంటున్నారు. కొందరైతే విశృంకలత్వానికి తెర లేపుతున్నారు. ఇంటర్వ్యూల పేరుతో మైనర్లను ఎంచుకుని అభ్యంతరకర వ్యాఖ్యలు చేయిస్తున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న నగర పోలీసు కమిషనర్ విశ్వనాథ్ చన్నప్ప సజ్జనర్ గురువారం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి వీడియోలు, ఇంటర్వ్యూలను అధ్యయనం చేస్తూ పోక్సోతో పాటు కిడ్నాప్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

అల్గరిథెమ్‌తో అత్యంత ప్రమాదకరం...

ఈ తరహాకు చెందిన అభ్యంతరకరమైన వీడియోలు, ఇంటర్వ్యూలు, రీల్స్ యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టాగామ్ తదితర సోషల్‌మీడియాల్లోనూ అందుబాటులో ఉంటున్నాయి. ఇటీవల కాలంలో సోషల్‌మీడియా ఖాతాలు, ఈ-కామర్స్ వెబ్‌సైట్లు తదితరాలన్నీ ప్రత్యేక ఆల్గరిథెమ్ ఆధారంగా పని చేస్తున్నాయి. ఈ ఆల్గరిథెమ్ సదరు వ్యక్తి ఏ తరహా కంటెంట్‌ను వీక్షిస్తున్నారు? ఎలాంటి వస్తువులు ఖరీదు చేస్తున్నారు? సెర్చ్ చేస్తున్నారు? అనే అంశాలను అధ్యయనం చేస్తుంది. ఐపీ అడ్రస్, మెయిల్ ఐడీ ఆధారంగా జరిగే ఈ ప్రక్రియలో ఆ వ్యక్తికి అదే తరహా కంటెంట్, ఉత్పత్తులకు సంబంధించిన వీడియోలు, యాప్స్ పదేపదే పంపిస్తుంది. ఈ కారణంగా ఇలాంటి వీడియోలు, రీల్స్‌ను పొరపాటున మైనర్లు ఒక్కసారి వీక్షిస్తే చాలు..వారికి పదే పదే అదే తరహావి కనిపిస్తాయి.

పోక్సోతో పాటు కిడ్నాప్ కేసుకు ఆస్కారం...

ప్రేమ, పెళ్లి, భాగస్వామ్యం తదితర అంశాలపై మైనర్లలో సరైన అవగాహన పెరిగేలా, వారు పెడదారి పట్టకుండా వీడియోలు రూపొందిస్తే ఇబ్బంది ఉండదు. అయితే మైనర్ల ప్రేమ వ్యవహారాలు, ముద్దుముచ్చట్లను రీల్స్, వీడియోలు, ఇంటర్వ్యూలుగా చిత్రీకరించి మరింత మందిని పెడదోవ పట్టించడం నేరమే అవుతుంది. ఈ వీడియోలతో పాటు వాటిలో మైనర్లు, యాంకర్లు చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో పోక్సో యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద యాంకర్లు, నిర్వాహకులపై కేసులు నమోదు చేయవచ్చు. ఈ ఇంటర్వ్యూల కోసం ఆ మైనర్లను వివిధ ప్రాంతాల నుంచి మరో ప్రాంతానికి తరలించడమూ నేరమే. దీనికి సంబంధించి కిడ్నాప్ కేసు నమోదు చేసే అవకాశమూ ఉంది. ఇవన్నీ పరిశీలించిన కొత్వాల్ సజ్జనర్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీనిపై గురువారం కొత్వాల్ 'ఎక్స్' ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఇవి చూసిన అనేక మంది తమ వీడియోలు, రీల్స్, ఇంటర్వ్యూలను డిలీట్ చేస్తుండటం గమనార్హం.

వ్యూస్ కోసం విలువలు వదిలేస్తారా?



వ్యూస్, లైక్స్‌తో పాటు సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి చిన్నారుల భవిష్యత్తును ఫణంగా పెట్టడం ఎంత వరకు సమంజసం? ఇది విలువలను వదిలేయడంతో సమానం. మైనర్లతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారు? ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించొద్దు. అలా చేయడం బాలల హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదు..చట్టరీత్యా నేరం. బాలబాలికల్ని ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం చైల్డ్ ఎక్స్‌ప్లాయిటేషనే అవుతుంది. ఇప్పటికే ఉన్న కంటెంట్‌ను తొలగించుకున్నా, భవిష్యత్తులో అప్‌లోడ్ చేసినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ఇలాంటి వీడియోలు, రీల్స్ గమనిస్తే 1930కు ఫోన్ చేసి లేదా (cybercrime.gov.in) ద్వారా ఫిర్యాదు చేయండి. పిల్లల బాల్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కాపాడటం కూడా తల్లిదండ్రుల బాధ్యతే.

– వీసీ సజ్జనర్, నగర కొత్వాల్



మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు, తిరునెల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్

డీసీసీలో యువతకు పెద్దపీట

- నిబద్ధత, క్రమశిక్షణ, సమర్థత ఉన్న నాయకుడే అధ్యక్షుడు
- తిరునెల్వేలి పార్లమెంట్ సభ్యుడు రాబర్ట్ బ్రూస్

చందానగర్: నిబద్ధత, క్రమశిక్షణ, సమర్థత ఉన్న నాయకుడినే డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేస్తామని ఏఐసీసీ సభ్యుడు తిరునెల్వేలి పార్లమెంట్ సభ్యుడు రాబర్ట్ బ్రూస్ అన్నారు. గురువారం శేరిలింగపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి హుడా కాలనీ ఎంఎస్‌పీ కన్వెన్షన్ సెంటర్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యుడు, తిరునెల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్, పీసీసీ ఉపాధ్యక్షుడు కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతీ కార్యకర్త అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ శక్తిని పునరుద్ధరించేందుకు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ యువతకు ప్రాధాన్యత ఇస్తుందని.. డీసీసీ కమిటీలోనూ వారికి పెద్దపీట వేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేశ్ గౌడ్, నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, నియోజకవర్గ సీనియర్ నాయకులు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ



లింగంపల్లిలో సప్తగిరి ఫాంహౌస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

33 మంది రిమాండ్

మంచాల: మండల పరిధిలోని లింగంపల్లిలో ఏర్పాటు చేసిన రేవ్ పార్టీపై బుధవారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. ఇందులో పాల్గొన్న 33 మందిని అరెస్టు చేశారు. మంచాల సీఐ మధు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సప్తగిరి ఫాంహౌస్‌లో నిబంధనలకు విరుద్ధంగా రేవ్ పార్టీ నిర్వహించారు. ఇందులో 25 మంది పురుషులు, 8మంది మహిళలు పాల్గొన్నారు. మద్యం సేవించి అశ్లీల నృత్యాలు చేస్తున్నానే సమాచారం అందడంతో మంచాల పోలీసులు దాడి చేశారు. వీరి నుంచి రూ.2,40,000 నగదు 11 వాహనాలు, 15 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని రిమాండ్‌కు తరలించారు.

పార్టీలో పాల్గొన్నది వీరే..

రుద్రశెట్టి సప్తగిరి, అనీల సురేష్‌కుమార్, పోరండ్ల మధుకర్, రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాంపురం రాజేశ్‌గౌడ్, కుండేటి విజయ్ శేఖర్ నాయకుడు, ఇమ్మిడిశెట్టి హరికృష్ణ, వల్లము రవీంద్రసాయి కుమార్, పురం సాయి కృష్ణ, పాపేర్తి రాజ్‌కుమార్, మూల మధుగౌడ్(మాజీ కార్పొరేటర్ ముఖేష్‌గౌడ్ తమ్ముడు), కొమ్మన సతీష్ కృష్ణ, నుగురు ప్రశాంత్, గట్టివార్ సునీల్, బండారు రమేష్, ప్రతాప్ గోపాల్, గడబోయిన బ్రహ్మ, జనంపేట్ బెక్కం గోపాలకృష్ణ, రంగు శ్యాం, వెలమ్మకన్ని లక్ష్మీ నర్సింహ, భరత్ ద్వాజ్, పోలుగుల కొండల ప్రవీణగౌడ్, శ్రీశైలం, డినావాయి శ్రీనివాస్, శ్రీనివాస్ సుబ్రహ్మణ్య తేజ, విజయ్ దిలికర్, చందంపేట్ అనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భర్త మృతిని తట్టుకోలేక..

దశదినకర్మలోపే భార్య మృతి



బాబ్జీ దంపతులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: భర్త దశదిన కర్మ రోజే భార్య అంత్యక్రియలు నిర్వహించిన విషాద ఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌లో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్‌లో నివాసముంటున్న సీనియర్ జర్నలిస్ట్ మేడపాటి బాబ్జీ(62) ఈనెల 5న గుండెపోటుతో చనిపోయారు. భర్త మరణాన్ని తట్టుకోలేకపోయిన జయప్రద(58) మనోవేదనతో అస్వస్థతకు గురైంది. ఈక్రమంలో ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా 14న చనిపోయింది. తెల్లవారితే తండ్రి దశదినకర్మ చేయాల్సిన పిల్లలు తల్లి అంత్యక్రియలు నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్ మామిడి సోమయ్య తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పోలీసు అమర వీరుల స్థూపం పనుల పరిశీలన

గన్‌ఫౌండ్రీ: గోషామహల్ పోలీస్ స్టేడియంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ అమరవీరుల స్థూపం నిర్మాణ పనులను గురువారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన పోలీస్ అమరవీరుల దినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమరవీరుల స్థూపం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీజీపీ వెంట అదనపు డీజీపీ మహేష్ భగవత్, నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం.రమేష్, నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలతో పేదలకు భరోసా



ఉమ్మడి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- పథకాల అమలులో జిల్లా మొదటి స్థానంలో నిలవడం హర్షణీయం
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు అమలు చేస్తున్న పీఎం జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) పథకాలతో వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని చేవెళ్ల ఎంపీ కార్యాలయంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్లు సుశీల్‌కుమార్, యాదగిరితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వారితో మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలను అన్ని వర్గాల పేదలకు అందించి భరోసాను కల్పించాలని సూచించారు. అర్హులైన పేదలందరూ సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నారు. ఈ బీమా పథకాలతో పాలసీదారుడు ప్రమాదవశాత్తు చనిపోయినా, సహజ మరణం పొందినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా వారికి ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. 2015లో ప్రారంభమైన ఈ పథకం జిల్లా అగ్రస్థానంలో ఉండటం హర్షణీయమన్నారు. జిల్లాలోని అన్ని బ్యాంకుల శాఖలు సమర్థవంతంగా పనిచేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచినందుకు ప్రత్యేకంగా అభినందనందించారు. 60 సంవత్సరాలు పైబడిన ప్రతీ వ్యక్తి యుక్త వయసులో దాచుకున్న సొమ్ముతో జీవితాంతం రూ.వేయి నుంచి రూ.5వేల వరకు పింఛన్ పొందే సౌకర్యం అటల్ పింఛన్ యోజనతో లభిస్తోందని చెప్పారు. ఈ పథకాన్ని సైతం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవలం రూ.20 లేదా రూ.456 చెల్లించి బ్యాంకులు ఇచ్చే రూపే కార్డు ద్వారా దాదాపు రూ.6 లక్షల వరకు జీవిత బీమా పొందవచ్చునని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను, సబ్సిడీలను, యువతకు అందించే రుణాలపై ప్రత్యేక చొరవ చూపాలని బ్యాంకు మేనేజర్లను కోరారు. ఉమ్మడి జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు గ్రామస్థాయి వరకు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, విక్రమ్, పి.శివప్రసాద్ పాల్గొన్నారు.

నల్లబజారుకు సన్న బియ్యం

- 996.80 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 144.30 క్వింటాళ్ల గోధుమలు పట్టివేత
- నిందుతులకు రిమాండ్

పహాడీషరీఫ్: నల్ల బజార్‌కు తరలిస్తున్న 996 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 144 క్వింటాళ్ల గోధుమలను పహాడీషరీఫ్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేందర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ లక్ష్మణ్(26), క్లీనర్ దాన(22) అన్నదమ్ములు. వీరిద్దరూ లారీ యజమాని ఆదేశానుసారం ప్రజల నుంచి పీడీఎస్ బియ్యాన్ని సేకరించిన మతిన్ అనే వ్యక్తి నుంచి మామిడిపల్లి మెట్రోనగర్ కాలనీలో లారీలో బియ్యం, గోధుమలు లోడ్ చేసుకుని గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్నారు. వీరితో పాటు ఆసిఫ్‌నగర్‌కు చెందిన డ్రైవర్ మహ్మద్ యూనుస్(50), బిహార్‌కు చెందిన డ్రైవర్ అజిత్ కుమార్(22) దోస్త్ వాహనాల్లో బియ్యాన్ని నగరంలో విక్రయించేందుకు బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేందర్ రెడ్డి, ఎస్ఐ ఎల్.వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల శాఖ డీసీఎస్‌ఓ కె.వనజాత, డిప్యూటీ తహసీల్దార్లు రవీందర్ నాయక్, వై.రామకృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ బృందం మామిడిపల్లి, జల్‌పల్లి మధ్యలో లారీలను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం రూ.80 లక్షల విలువైన 996.80 క్వింటాళ్ల బియ్యం, 144.30 క్వింటాళ్ల గోధుమలు, 6,300 ఖాళీ గోనె సంచులు, 14 టైర్ల లారీ, రెండు అశోక్ లేల్యాండ్ దోస్త్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై మూడు కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



మాడ్గుల ఠాణాలో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

మాడ్గుల: ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సూచించారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. రౌడీషీటర్స్ హిస్టరీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్‌లను పరిశీలించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. గ్రామస్తుల సహకారంతో ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చొరవతీసుకోవాలన్నారు. ఠాణాకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మసులుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల సీఐ వేణుగోపాల్‌రావు, ఎస్ఐ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు పొందవచ్చని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద రైతులకు ఉచితంగా శనగ, కుసుమ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలే కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, ఏడీఏ వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతా సింగ్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఏవోలు జ్యోతి, ప్రసన్న లక్ష్మి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పార్కింగ్ పరేషాన్

- విజయవాడ హైవే సర్వీస్ రోడ్లపై అడ్డగోలుగా నిలుపుతున్న వాహనాలు
- ప్రమాదాలతో జంకుతున్న ప్రయాణికులు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



రామోజీ ఫిల్మ్‌సిటీ ఎదుట సర్వీస్ రోడ్డుపై అడ్డగోలుగా నిలిపిన వాహనాలు

అబ్దుల్లాపూర్‌మెట్: విజయవాడ జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మించిన సర్వీస్ రోడ్డుపై వాహనాలు అడ్డగోలుగా పార్క్ చేస్తున్నారు. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకుని మృత్యువాత పడుతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారులు, హోటళ్లు ఉండడంతో 24 గంటల పాటు వాహనాలు హైవేతో పాటు సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. వాహనాలను తీస్తున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న వాహనదారులు ఆందోళనకు గురై రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. అక్రమ పార్కింగ్ చేస్తున్న వాహనదారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన కూడళ్లలో అక్రమ పార్కింగ్

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించిన సర్వీస్ రోడ్డుపై ప్రధాన కూడళ్లలోనే వాహనదారులు అడ్డగోలుగా వాహనాలు నిలుపుతున్నారు. హయత్‌నగర్ నుంచి వర్డ్ అండ్ డీడ్, లక్ష్మారెడ్డి పాలెం, పెద్దఅంబర్‌పేట చెక్‌పోస్ట్, ఔటర్ రింగ్‌రోడ్డు, గండిమైసమ్మ దేవాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ గేటు ఎదుట, అబ్దుల్లాపూర్‌మెట్ మయూరి కాంట, ఇనాంగూడ, బాటసింగారం మౌంట్ ఒపెరా, కొత్తగూడెం ప్రాంతాల్లో రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డుపై వాహనాలను నిలిపివేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

సర్వీస్ రోడ్లపై వాహనాలను నిలుపుతుండడంతో గ్రామాలకు వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలను నిలిపే డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తీయాలని సూచించినా ఘర్షణలకు దిగుతున్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కాశీనాథుని సత్యనారాయణశర్మ, అబ్దుల్లాపూర్‌మెట్

భారతి సిమెంట్‌తో నిర్మాణాలు వేగవంతం

- మార్కెట్లోకి ఆల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్
- సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్
- కొత్తూరులో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు


తాపీ మేస్త్రీలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

కొత్తూరు: భారతి సిమెంట్‌తో నిర్మాణాలు మరింత వేగవంతంగా పూర్తి చేయవచ్చని సంస్థ టెక్నికల్ అధికారి శ్రీకాంత్ అన్నారు. కొత్తూరు పట్టణంలో గురువారం తాపీ మేస్త్రీలకు నిర్మాణ రంగం, సిమెంట్ వినియోగంపై భారతి సిమెంట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ ఆల్ట్రాఫాస్ట్ బ్రాండ్‌తో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణ మార్కెట్లోకి విడుదల చేసిందన్నారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి ఆల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని వివరించారు. అంతేకాకుండా సిమెంట్ నాణ్యత మరింత దృఢంగా ఉంటుందని తెలిపారు. భారతి ఆల్ట్రాఫాస్ట్ సిమెంట్ సీసీ రోడ్లు, స్లాబులు, వంతెనల నిర్మాణాలకు అత్యంత అనువుగా ఉంటుందని స్పష్టంచేశారు. భారీ నిర్మాణాలు చేసే సంస్థల నిర్వాహకులకు సిమెంట్ వినియోగంలో ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని తెలిపారు. భారతి సిమెంట్ వినియోగించే వారి కట్టడాల వద్దకే ఇంజనీర్లు వచ్చి సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టెక్నికల్ ఆఫీసర్ నితిన్, డీలర్ జయవర్ధన్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో ఇసుక ఫిల్టర్లు ధ్వంసం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ సమీపంలో అక్రమంగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ఫిల్టర్లపై గురువారం రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ విషయమై ఫిర్యాదులు అందడంతో అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న 3 ఇసుక ఫిల్టర్లను జేసీబీలతో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీకాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఇసుక ఫిల్టర్ల వద్ద దాడులు చేస్తున్న పోలీసులు

గుర్తు తెలియని వాహనం ఢీ..

వ్యక్తి మృతి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ నర్సయ్య తెలిపిన ప్రకారం.. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న నాగయ్య ఓ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15న ఇంటికి వస్తున్న క్రమంలో జాతీయ రహదారిపై తిమ్మాపూర్ వద్ద ఉన్న టీ టైం హోటల్ వద్ద ఆయన్ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగయ్య రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సూరమ్మ ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



మీర్‌పేట: గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని మీర్‌పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం. ఈ నెల 15వ తేదీన బాలాపూర్ చౌరస్తాలో పెట్రోలింగ్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా రోడ్డు పక్కన ఓ మహిళ (60) స్పృహ లేకుండా పడి ఉండడాన్ని గమనించారు. దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి వివరాలు తెలియరాలేదని, స్థానికంగా భిక్షాటన చేస్తుండేదని, బంధువులు ఎవరైనా ఉంటే ఠాణాలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్‌ను అందజేసిన పోలీసులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సెల్‌ఫోన్ ప్రయాణికుడికి ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు అందజేశారు. ప్రయాణికుడు ఉడిపి హోటల్ వద్ద ఫోన్ పోగొట్టుకున్నట్లు ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ పరిశీలించిన పోలీసులు గుర్తించి ప్రయాణికుడికి అందజేశారు. పోలీసులు కేవలం గంట వ్యవధిలోనే ఫోన్‌ను గుర్తించి అందజేయడంపై ప్రయాణికులుకు సంతోషం వ్యక్తం చేశాడు.

రాజశ్రీ కోళ్ల పెంపకంపై శిక్షణ

ఏజీవర్సిటీ: పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో గురువారం రాజశ్రీ కోళ్ల పెంపకంతో గ్రామీణ ప్రజలకు ఉపాధి అనే అంశం పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశు వైద్య విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి డాక్టర్ ఎం కిషన్ కుమార్ కోళ్ల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు గ్రామీణ మహిళలకు ఆర్థిక అభివృద్ధి పై సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, డాక్టర్ అనిల్,డాక్టర్ మాదురీ,రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు బీభత్సం


క్రేన్ సహాయంతో వాహనాలను తరలిస్తున్న పోలీసులు

టైర్ పేలడంతో ఘటన

- డివైడర్ అవతలి వైపు ఉన్న బొలెరోను ఢీకొట్టిన వైనం

రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం ఉదయం ఓ ప్రైవేటు బస్సు బీభత్సం సృష్టించింది. 100 కిలో మీటర్ల వేగంతో వెళుతున్న బస్సు టైర్ పేలిపోవడంతో బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలిపై వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. అటుగా వస్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టి 10 మీటర్ల దూరం లాక్కెళ్లింది. ఈ ఘటనలో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగపూర్ నుంచి నగరానికి వస్తున్న ప్రైవేట్ బస్సు గచ్చిబౌలి ప్రాంతంలో ప్రయాణికులను దింపి ఔటర్ మీదుగా ఎగ్జిట్ 17 నుంచి రాజేంద్రనగర్ ఆరాంఘర్ చౌరస్తాకు వెళ్లాల్సి ఉంది. ఉదయం అప్పా నుంచి హిమాయత్‌సాగర్‌కు వస్తుండగా బస్సు టైర్లు ఒక్కసారిగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పింది. డ్రైవర్ వాహనాన్ని నియంత్రించే క్రమంలో ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి విద్యుత్ స్తంభంతో పాటు చెట్లను ఢీకొని రోడ్డు అవతలివైపు దూసుకెళ్లింది. అదే సమయంలో శంషాబాద్ కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు అన్‌లోడ్ చేసి వెళుతున్న బొలెరోను ఢీకొట్టి రోడ్డుపై నుంచి ఈడ్చుకెళ్లింది. రోడ్డు పక్కనే ఉన్న బారికేడ్లను ఢీకొని ఆగిపోయింది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్‌తో పాటు బస్సు డ్రైవర్ అందులోని 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన జరిగిన వెంటనే గాయాలతో ఉన్న డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. బొలెరో డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


డివైడర్‌ను ఢీకొట్టిన బస్సు

డ్రోన్ పిచికారీతో సమయం ఆదా


రేగడిదోస్వాడలో డ్రోన్ పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అకిన్ అనలెటిక్స్ సంస్థ ప్రతినిధులు

అకిన్ అనలెటిక్స్ సంస్థ డైరెక్టర్, హెచ్‌ఆర్ సుబ్బారావు

షాబాద్: డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అకిన్ అనలెటిక్స్ సంస్థ డైరెక్టర్, హెచ్ఆర్ సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ అమృత్ రాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రేగడిదోస్వాడలో సుగుణ మాల రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులకు డ్రోన్‌తో పురుగు, తెగుళ్ల మందు, ఎరువుల పిచికారీ ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రోన్ పిచికారీతో సమయం ఆదాతో పాటు ఎక్కువ విస్తీర్ణంలో పంటలు కాపాడి దిగుబడి పెరుగుతుందన్నారు. ఎకరాకు ఐదు నుంచి ఆరు నిమిషాల్లో స్ప్రేయింగ్ పూర్తవుతుందని చెప్పారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ... ఈ సాంకేతిక పరిజ్ఞానంతో పురుగు మందు వ్యయం, శ్రమ, ఖర్చు, నీటి అవసరాన్ని తగ్గించవచ్చన్నారు. డ్రోన్లతో ప్రభావవంతంగా ఏకరీతిలో పురుగు మందు పిచికారీ చేయమచ్చాన్నారు. చీఫ్ అకడమిక్ అధికారి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుంటే పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రోన్ పైలెట్స్ పవన్, మనోజ్ కుమార్, దిలీప్ కుమార్, రైతులు ప్రవీణ్, మాధవరెడ్డి, మల్లారెడ్డిగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ రైతులు పాల్గొన్నారు.

డేటింగ్... లూటింగ్!

సాక్షి, సిటీబ్యూరో: వివాహం లేదా సహజీవనం చేయడానికి భాగస్వామి కోసం డేటింగ్ సైట్స్‌లో సెర్చ్ చేసిన మలక్‌పేట యువకుడు (32) సైబర్ నేరగాళ్ల వల్లో చిక్కాడు. వారి మాటలు నమ్మి రూ.6.49 లక్షలు కోల్పోయాడు. ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయగా... గత నెల 7న సదరు యువకుడికి తాన్య శర్మ అని చెప్పుకున్న మహిళ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. రూ.1,950 చెల్లించి తమ ఫ్రెండ్‌షిప్ గ్రూపులో చేరాలని పేర్కొంది. అలా చేసిన తర్వాత ప్రీతి, రితికా పేర్లతో మరో ఇద్దరు సంప్రదించారు. వారు హోటల్ బుకింగ్, మీటింగ్ కన్ఫర్మేషన్, సర్వీస్ టాక్స్, రీఫండ్ ప్రాసెస్, ఖాతా ధ్రువీకరణ, గోప్యత భద్రత తదితరాల కింద రీఫండబుల్ కేటగిరీ అంటూ మరికొంత గుంజారు. మొత్తమ్మీద రూ.6,49,840 కోల్పోయిన బాధితుడు గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడం కేసు నమోదైంది.

నీవు లేక నేనుండలేనని..

- నాలుగు రోజుల క్రితం భార్య మృతి
- మనస్తాపంతో భర్త ఆత్మహత్య


రాజశేఖర్ మృతదేహం

సికింద్రాబాద్: భార్య మృతిని జీర్ణించుకోలేక ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సంజీవయ్యపార్కు రైల్వే స్టేషన్ సమీపంలోని అప్‌లైన్ వద్ద మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడు బేగంపేట డివిజన్ పాటిగడ్డకు చెందిన కావలి రాజేఖర్ (32) గుర్తించారు. నాలుగు రోజుల క్రితంరాజశేఖర్ భార్య మృతి చెందింది. అప్పటి నుంచి అతను మద్యం తాగుతూనే ఉన్నాడు. మద్యం మత్తులో అతను బుధవారం అర్ధరాత్రి సంజీవయ్య పార్కు సమీపంలోని రైలుపట్టాలపైకి చేరుకున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాంధీ మార్చురీలో రాజశేఖర్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అక్షయ


అక్షయ

తుక్కుగూడ: రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్-14 విభాగంలో మున్సిపల్ కేంద్రంలోని బ్రిలియంట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని అక్షయ ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల యాజమాన్యం ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ కె.వెంకటరామచారి, కబడ్డీ కోచ్ వంగా శ్రీధర్‌రెడ్డి, పీఈటీ సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తితగాదాలో కత్తిపోట్లకు గురైన వ్యక్తి మృతి

మొయినాబాద్‌రూరల్: ఆస్తి తగాదాల కారణంగా కత్తిపోట్లకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఈ నెల 11న సురంగల్ గ్రామం కొత్రాస్‌లలో ఇంటి స్థలం విషయంలో జరిగిన గొడవలో రామగళ్ల శ్యామ్(45)తో సోదరుడు నందు, సావిత్రి దంపతులతో పాటు వీరి కుమారుడు ప్రసాద్ గొడవపడ్డారు. ఈ క్రమంలో ప్రసాద్ కత్తితో దాడి చేయడంతో గాయపడిన శ్యామ్‌ను నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ప్రసాద్‌తో పాటు అతని తల్లిదండ్రులను 12వ తేదీన రిమాండ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రుడుగురువారం మృతి చెందాడు. దీంతో గ్రామంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రులపై కత్తితో తనయుడి దాడి

మణికొండ: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడు తల్లి దండ్రులపై కత్తితో దాడి చేసిన సంఘటన గండిపేటలోని ఈఐపీఎల్ అపిలగేటెడ్ కమ్యూనిటీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నార్సింగి ఎస్సై గోపి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. భారతి, రవీందర్‌రెడ్డి దంపతుల కుమారుడు రఘుపాల్‌రెడ్డి ఓ ప్రైవేటు కళాశాలలో ఎల్ఎల్‌బీ చదువుతున్నాడు. గత కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధ పడుతున్నాడు. దీనిని గుర్తించిన అతడి తల్లిదండ్రులు మానసిక వైద్యుడికి చూపించాలని భావించారు. ఈ విషయం తెలుసుకున్న అతను తనకు ఏమి కాలేదని, అనవసరంగా మానసిక రోగిగా ముద్ర వేస్తున్నారనే కోపంతో బుధవారం రాత్రి ఇంట్లో కూరగాయాలు కోసే కత్తితో వారిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టగా గత కొంత కాలంగా తమ కుమారుడు మతి స్థిమితం కోల్పోయాడని, అతడి డాక్టర్‌కు చూపిస్తామని చెప్పినందుకు తమపై దాడి చేశాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి


శ్రీనివాస్(ఫైల్)

అనంతగిరి: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బంట్వారం మండలం మోత్కుపల్లికి చెందిన శ్రీనివాస్(26) కొంత కాలంగా వికారాబాద్ పట్టణంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా అర్ధరాత్రి దాటిన తర్వాత వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి సమీపంలో నివాసం ఉండే తన స్నేహితున్ని బైక్‌పై ఇంటి వద్ద వదిలిపెట్టాడు. అనంతరం తిరిగి వికారాబాద్‌కు వస్తున్న క్రమంలో మర్రి చెన్నారెడ్డి విగ్రహం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు శ్రీనివాస్ గత 18 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న శ్రీనివాస్‌కు భార్య, బాబు ఉన్నారు. మృతుడి తండ్రి అనంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీంకుమార్ తెలిపారు.

వేరుశనగ విత్తనాల డీసీఎం బోల్తా

దోమ: వేరుశనగా విత్తనాల బస్తాలు తీసుకెళ్తున్న ఓ డీసీఎం వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటన దోమ మండల పరిధిలోని మోత్కూర్ శివారులో చోటుచేసుకుంది. మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి రైతు వేదికకు 18 క్వింటాళ్లు(90 బస్తాలు)సబ్సిడీ వేరుశనగ రావాల్సి ఉంది. అయితే బుధవారం మహబూబ్‌నగర్ బయల్దేరిన డీసీఎం దుద్యాల మండలంలో కొంత మేర ఖాళీ చేసి మిగతా లోడ్‌తో దాదాపూర్, కుల్కచర్ల, మోత్కూర్ మీదుగా బ్రాహ్మణపల్లి వెళ్తుండగా అదుపు తప్పి మోత్కూర్ గేట్ వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, అందులో ఉన్న 90 బస్తాల వేరుశనగా విత్తనాలు నీటిలో పడి తడిసి ముద్దయ్యాయి. ఇది గమనించిన కొంతమంది సుమారు 20 బస్తాల వరకు ఎత్తుకెళ్లారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని


స్వప్నను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాలతి

మొయినాబాద్‌రూరల్: జిల్లా స్థాయిలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో కరాటే విభాగంలో చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి అధ్యాపక బృందంతో కలిసి విద్యార్థిని స్వప్నను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వప్న పాఠశాలకు ఎంతో కీర్తిని సంపాదించిందన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

వచ్చే విచారణకు అందరూ హాజరుకావాలి

- డెక్కన్ కిచెన్ కేసుపై విచారణ వాయిదా
- దగ్గుబాటి కుటుంబసభ్యులు హీరో వెంకటేశ్, రానా, సురేశ్ కోర్టులో హాజరుకావాల్సిందే
- ఒక్కొక్కరూ రూ.10 వేలతో రెండు పూచీకత్తులను దాఖలు చేయాలి
- నవంబర్ 14కు విచారణ వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు : వచ్చే విచారణకు దగ్గుబాటి ఫ్యామిలీ కుటుంబ సభ్యులైన హీరో వెంకటేశ్, రానా, సురేశ్ కోర్టులో హాజరుకావాల్సిందేనని నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా గత విచారణలో సూచించిన పూచీకత్తులు దాఖలు చేయలేదని, తదుపరి విచారణలోపు ఒక్కొక్కరూ రూ.10 వేలతో రెండు పూచీకత్తులను దాఖలు చేయాలని వారి తరుపు న్యాయవాదికి సూచించారు. అనంతరం తదుపరి విచారణను నవంబర్ 14కు వాయిదా వేసింది. ఫిల్మ్‌నగర్ భూ వివాదంపై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఫిల్మ్‌నగర్‌లోని తన డెక్కన్ కిచెన్ హోటల్‌ను అక్రమంగా కూల్చివేశారని నందకుమార్ అనే వ్యక్తి హీరోలు దగ్గుబాటి రానా, వెంకటేశ్, సురేశ్‌లపై కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుపై గురువారం నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లో విచారణ జరిగింది. హీరోలు రానా, వెంకటేశ్, ప్రొడ్యూసర్ సురేశ్‌బాబు గైర్హాజరుకాగా వారి తరుపు న్యాయవాది పిటిషన్లను దాఖలు చేశారు. ఫిర్యాదుదారుడు నందకుమార్ విచారణకు హాజరయ్యారు. దగ్గుబాటి కుటుంబం దురుద్దేశపూర్వకంగా తన డెక్కన్ కిచెన్ హోటల్‌ను కూల్చివేయించి ఇబ్బందులకు గురిచేస్తున్నదని, వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని నందకుమార్ కోర్టుకు విన్నవించుకున్నారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు గత విచారణలో నిందితులు అందరూ వచ్చే విచారణకు హాజరు కావాలని తెలిపినా ఈ విచారణకు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. వచ్చే విచారణకు నిందితులు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాల్సిందేనని, అదేవిధంగా ఒక్కొక్కరూ రూ.10 వేలతో రెండు పూచీకత్తులను దాఖలు చేసుకోవాలని వారి తరుపు న్యాయవాదికి సూచించింది. దీంతో తదుపరి విచారణను వచ్చేనెలకు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

కాంట్రాక్టర్‌పై పై కేసు నమోదు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... భవానీ శంకర్ అనే వ్యక్తి జర్నలిస్టు కాలనీలో 371 గజాల స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని షేక్‌పేట్ మండల తహసీల్దార్ అనితారెడ్డి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 403లో ఉన్న 371 గజాల ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మించడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు భవానీ శంకర్ అనే కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దెకు తీసుకుని అమ్మేస్తారు..

ఇద్దరు నిందితుల రిమాండ్

- పరారీలో మరొకరు
- ఏడు వాహనాలు స్వాధీనం

చిలకలగూడ : ఎక్కువ అద్దె చెల్లిస్తామని నమ్మించి కార్లను అద్దెకు తీసుకుంటారు. రెండు నెలలు సక్రమంగా అద్దె చెల్లించి, ఆపై వాటిని అక్రమంగా తక్కువ ధరకు విక్రయించడమేగాక వాహన యజమానులపై బెదిరింపులకు పాల్పడుతున్న ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.80 లక్షల విలువైన ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ ఠాణాలో గురువారం అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ అనుదీప్‌లతో కలిసి ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ నామాలగుండు ఉప్పరిబస్తీకి చెందిన సంగిశెట్టి ప్రవీణ్‌కుమార్ డ్రైవర్‌గా పని చేసేవాడు. జల్సాలకు అలవాటు పడిన అతను సులువుగా డబ్బులు సంపాదించేందుకు తార్నాకకు చెందిన అమరేందర్, మహ్మద్ రిజ్వాన్‌తో జత కట్టాడు. శ్రీలక్ష్మీ లాజిస్టిక్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. కార్ల యజమానులను సంప్రదించి తమకు వాహనాలు అద్దెకు ఇస్తే సెవెన్ సీటర్‌కు నెలకు రూ.25వేలు, ఫైవ్ సీటర్‌కు రూ. 20 వేలు అద్దె చెల్లిస్తామని ప్రచారం చేసుకున్నారు. రెండు నెలల పాటు సక్రమంగా అద్దె చెల్లించి ఆ తర్వాత మొహం చాటేస్తారు. సదరు వాహనాలను తక్కువ ధరకు విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. నెల అద్దె లేదా వాహనం ఇవ్వాలని అడిగిన యజమానులపై బెదిరింపులకు దిగేవారు. అంబర్‌పేటకు చెందిన జ్ఞానేశ్వర్ తన ఎర్టిగా కారును మూడు నెలల క్రితం వారికి అద్దెకు ఇచ్చాడు. అద్దె డబ్బులు, వాహనం తిరిగి ఇవ్వకపోవడంతో మోసయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు నిందితులు ఇదే తరహాలో పలువురి నుంచి అద్దెకు తీసుకున్న వాహనాలను తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు సంగిశెట్టి ప్రవీణ్‌కుమార్, అమరేందర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించారు. వారి నుంచి సుమారు రూ.80 లక్షల విలువైన ఏడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు మహ్మద్ రిజ్వాన్ కోసం గాలిస్తున్నారు. కేసును చేధించిన చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, ఎస్‌ఐలు రవికుమార్, ఆంజనేయులు, సిబ్బందిని డీసీపీ అభినందించి రివార్డులు అందించారు.